# ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా


మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల

- కాంగ్రెస్ టిక్కెట్లు అమ్ముకుంటున్నది
- మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 07: తనకు మరోసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే కరీంనగర్ నియోజకవర్గాన్ని మరింత ఉత్సాహంతో అభివృద్ధి పథంలోకి తీసుకపోతానని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక రాజశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. తనను ఆశీర్వదించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన మున్నూరు కాపులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలోకి వచ్చేవి కావని, వాటికి వేస్తే ఓటు వృథా అవుతుందని, తనకు ఓటు వేసి గెలిపిస్తే మంత్రి అవుతానని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. అన్ని గ్రామాలకు సాగునీరు తీసుకువచ్చామని, రోడ్లను అభివృద్ధి చేసి జీవన ప్రమాణాలను పెంచామన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకులు కావాలో ఎన్నికప్పుడే కనిపించి, జైళ్ల చుట్టూ తిరిగే నాయకులు కావాలో ఆలోచన చేయాలని సూచించారు. సమైక్య పాలనలో రోడ్లు లేక ఎంతో ఇబ్బంది పడ్డామని, కాని రాష్ట్రం సాధించుకున్న తర్వాత రూ.వెయ్యి కోట్ల నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. పచ్చని తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలిపే కుట్రలు సాగుతున్నారయని, ఒక్క ఓటు తప్పు జరిగితే తెలంగాణ మళ్లీ అంధకారం అవుతుందన్నారు. అడ్డగోలు హామీలు ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ వస్తున్నాయని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్‌కు అండగా నిలిచి కారు గుర్తు ఓటు వేయాలని కోరారు. మీ ఆశీర్వదంతోనే ఈ స్థాయికి ఎదిగానని, ఎప్పటికీ సంఘం మద్దతు మరిచిపోనని పేర్కొన్నారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్, నాయకులు కర్ర రాజశేఖర్, తోట సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన మున్నూరు కాపు సంఘ ప్రతినిధులు

# కేసీఆరే మూడోసారి ముఖ్యమంత్రి

- బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం
- అవకాశం కల్పించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా
- మండలి విప్, హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి


హుజూరాబాద్ రూరల్ : రాంపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 7 : వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని మండలి విప్, బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం హుజూరాబాద్ మండలంలోని బొత్తలపల్లి, జూపాక, రాంపూర్, రంగాపూర్ గ్రామాల్లో జరిగిందని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌తో కలిసి ప్రచారం నిర్వహించగా, మహిళలు మంగళహారతులు, కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఅరే మూడోసారి ముఖ్యమంత్రి అవుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవని గుర్తు చేశారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్న ఘనత కేసీఅర్‌కే దక్కిందని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పెంచారని చెప్పారు. అధికారంలోకి రాగానే మరోసారి ఆసరా పింఛన్లు పెంచుతామని తెలిపారు. అనంతరం గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీఅర్ పాలనలోనే అన్ని కులాలకు సముచిత న్యాయం జరిగిందని తెలిపారు. యాదవులకు గొర్లు, మత్స్యకారులకు చెరువులు, చేప పిల్లలు, దళితులకు దళితబంధు, బీసీలకు బీసీ బంధు వంటి అన్ని కులాలకు న్యాయం చేసింది కేసీఅర్ అని గుర్తు చేశారు. ఉప ఎన్నికల్లో గెలిచిన ఈటల రాజేందర్ కేంద్రంలో అధికారంలో ఉన్నా కూడా అభివృద్ధి కోసం ఒక్క పైసా కూడా తీసుకురాలేదని చెప్పారు. కారు గుర్తుకు ఓటు వేసి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్, హుస్నాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ అద్యక్షుడు బండ శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు ఐలన్న, సర్పంచ్‌లు అంకూస్, మనోహర్, ఎంపీటీసీలు బండ రమేశ్, వేణుగోపాల్‌రెడ్డి, బీఅర్ఎస్ నాయకులు పోరెడ్డి వెంకట కిషన్‌రెడ్డి, కేతిరి రాజప్రతాప్‌రెడ్డి, సురుకంటి సదానందరెడ్డి, స్వామిరెడ్డి, చిరంజీవి, మొలుగూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

# కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన డీఈవో



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 7 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీసీ, ఎంసీఎంసీ, మీడియా, కాల్‌సెంటర్, కంట్రోల్ రూమ్‌తో పాటు ఇతర ఎన్నికల విభాగాలను జిల్లా ఎన్నికల అధికారి(డీఈవో), కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకు అన్ని విభాగా ల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరుగకుండా చూడాలని సూచించారు. వివిధ అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, చానళ్లలో ప్రసారమయ్యే ఇంటర్వ్యూలు, రాజకీ య పరమైన కార్యక్రమాలు ఎప్పటికప్పుడు గమనించాలని ఆదేశించారు. ఇక్కడ డీఆర్వో పవన్‌కుమార్, డీఈఈ కొండయ్య, డీఐవో శివరాములు, డీసీవో రజనీకాంత్, ఏఈఐఈ ఉషారాణి, డీపీఆర్వో ఏడీ కలీం, ఏపీఆర్వో వీరాంజనేయులు, రాంబాబు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# గ్యారెంటీలు నమ్మి ఆగం కావొద్దు

- బీఆర్ఎస్ వస్తే సంక్షేమం.. కాంగ్రెస్ వస్తే అంధకారం
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- పలు గ్రామాల్లో ప్రచారం
- బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 7 : ఆరు గ్యారెంటీల పేరుతో దొంగ మాటలు చెప్పి ఊళ్లలోకి వస్తున్న పగటి బిచ్చగాళ్ల మాటలు నమ్మి ప్రజలు ఆగం కావొద్దని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. మంగళవారం మండలంలోని మక్తపల్లి, నల్లగొండ, సాహెబ్‌పల్లి, బాలయ్యపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నల్లగొండకు చెందిన కాంగ్రెస్ నాయకులు 30 మంది బీఆర్ఎస్‌లో చేరగా ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో సాగునీరు లేక ఉన్న ఊరును, కన్నవాళ్లను వదిలి గల్ఫ్ దేశాలు, బొంబాయికి బతుకు దెరువు కోసం వెళ్లారని, కేసీఆర్ సీఎం అయ్యాక కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్షలాది ఎకరాలకు సాగునీళ్లు అందించి రైతులను కంటిరెప్పలా కాపాడుకుంటున్నట్లు తెలిపారు. ఒకప్పుడు కరెంటు, సాగునీళ్లు లేవని, కేసీఆర్ సీఎం అయిన తర్వాతనే వ్యవసాయానికి 24 గంటల కరెంటు, రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.10 వేల పెట్టుబడి సాయం, రైతుబీమా ద్వారా రూ.5 లక్షల సాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో అంశాలను వివరించారు. కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించి, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.


మధురానగర్‌లో దివ్యాంగుడితో కలిసి భోజనం చేస్తున్నఎమ్మెల్యే రవిశంకర్

# సీఎం కేసీఆర్‌తోనే దివ్యాంగుల సంక్షేమం

- గతంలో పట్టించుకోని కాంగ్రెస్ పాలకులు
- స్వరాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గంగాధరలో దివ్యాంగులతో ఆత్మీయ సమ్మేళనం

గంగాధర, నవంబర్ 7 : రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని చొప్పదండి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. మంగళవారం గంగాధర మండలం మధురానగర్‌లోని వీఏఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన వారినుద్దేశించి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో దివ్యాంగులను పట్టించుకున్న పాలకులు లేరని, గత ప్రభుత్వాల హయాంలో పెన్షన్ ఎంత వచ్చేదో?, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంత వస్తుందో గుర్తు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.4016 ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. పొరపాటున కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే రాష్ట్రంలోని ప్రజలను అధోగతి పాలు చేస్తుందని చెప్పారు. ఐదు గ్యారంటీలతో కర్నాటక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా చేతులెత్తేసిందన్నారు. ఆ పార్టీని నమ్మి ఓట్లు వేసి అరిగోస పడుతున్నామని కర్ణాటక రైతులు తెలంగాకు వచ్చి వివరిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో వచ్చి అబద్ధపు ప్రచారాలు చేసే వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. ప్రజా సంక్షేమాన్ని కాక్షించే సీఎం కేసీఆర్‌ను మరచిపోవద్దని, చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బోయినిపల్లి, చొప్పదండి ఎంపీపీలు పర్లపెల్లి వేణు, చిలుక రవీందర్, కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, కొడిమ్యాల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, జనగం శ్రీనివాస్, నాయకులు రాచమల్ల రవి, సుంకె అనిల్, ప్రశాంత్, ఇరుగురాల రవి, గంగాధర సంపత్ పాల్గొన్నారు.